
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత ఆదివారం గరిష్ఠం : 37.0 కనిష్ఠం : 24.0

ANDHRAJYOTHY

5



అనంతపురం

జిల్లా వార్తలు

సోమవారం 24 మార్చి 2025

అమరావతికి కలెక్టర్

జేసీకి ఇన్‌చార్జి బాధ్యతలు

నేడు కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

అనంతపురం టౌన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ శనివారం రాత్రి అమరావతికి వెళ్లారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయు డు ఈనెల 25,26 తేదీలలో కలెక్టర్లతో సదస్సు నిర్వహిస్తున్నారు. దీంతో కలెక్టర్ జిల్లా ప్రగతి ప్రణాళికలను సిద్ధంచేసుకొని వెళ్లారు. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ వ్యవహరించనున్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కారవేదిక కొనసాగుతుందని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ పేర్కొన్నారు. జిల్లా అధికారులందరూ పాల్గొంటారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

హామీల అమలుకు ఐక్య ఉద్యమం

- ఈ ఏడాదిలోపు స్థలాలు, ఇళ్లు ఇవ్వాలి
- రైతుకు రూ. 20 వేలు అందించాలి
- తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



సీపీఐ నాయకులు, శ్రేణుల ర్యాలీ..


అనంతపురం విద్య, మార్చి 23(ఆంధ్రజ్యోతి): డబుల్ ఇంజన్ సర్కారు అంటూ...చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే తాము సైతం డబుల్ ఇంజన్, ట్రిబుల్ ఇంజన్‌తో కొడతాం అంటూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ హెచ్చరించారు. ఎర్ర జెండాల పార్టీలను కలుపుకుని ఐక్యంగా ఉద్యమిస్తామన్నారు. సీపీఐ దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని కేఎస్ఆర్ కాలేజ్ ఎదుట బహిరంగసభ నిర్వహించారు. ముందుగా రైతు బజార్ నుంచి వందలాది మంది సీపీఐ నాయకులు, శ్రేణులు ర్యాలీగా సభాస్థలికి వచ్చారు. బహిరంగసభలో ముఖ్యఅతిథి రామకృష్ణ మాట్లాడు తూ ఈ ఏడాదిలోగా పేదలకు స్థలాలతోపాటు, ఇళ్లు ఇవ్వాలన్నారు. రైతులకు రూ. 20 వేలు ఇవ్వాలని, విద్యాసంస్థల ప్రారంభం నాటికి తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందజేయాలన్నారు. బీజేపీ మోసాలపై సీఎం చంద్రబాబు మేల్కోవాలని హితవు పలికారు. ఇప్పటికే రాష్ట్రానికి రూ.3 లక్షల కోట్లు ఇచ్చామని బీజేపీ అబద్ధాలు చెబుతోందన్నారు. పోలవరం ఎత్తు తగ్గిస్తే రాయలసీమ, ఉత్తరాంధ్రకు తీరని నష్టం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతకు ముందు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు జగదీష్ మాట్లాడుతూ ప్రజల కోసం సీపీఐ పోరాడుతుందన్నారు. దేశవ్యాప్తంగా కుల గణన జరపాలన్నారు. మతోన్మాదనంతో కార్పొరేట్లకు ఊడిగం చేస్తోందన్నారు. ఏప్రిల్ 14 తర్వాత రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి బీజేపీ పాలనా విధానాలపై ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ భూరాబందులు!

మఠం భూమి పిత్రార్జితంగా నమోదు

- బోగస్ పత్రాలతో ఆలయ భూములు స్వాహా
- రూ.11 కోట్ల విలువైన భూముల ఆక్రమణ

జనార్దనపల్లిలోని రామస్వామి దేవాలయం →



విడపనకల్లు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు యథేచ్ఛగా భూదందా సాగించారన్నది బహిరంగ రహస్యమే. మఠం, ఆలయ భూములనూ వదల్లేదు. మఠం భూమి పిత్రార్జితం అంటూ ముగ్గురు అన్నదమ్ములు బోగస్ పత్రాలతో అక్రమంగా పాసుపుస్తకాలు చేయించుకున్నారు. వైసీపీ ప్రభుత్వం తెచ్చిన అడ్డగోలు జీవోతో తప్పుడు సమాచారంతో ఆలయ భూమిని కాజేశారు. అర్చకులకు బదులు వైసీపీ నాయకులు కాజేశారు. ఇలా మండలంలోని రెండు గ్రామాల పరిధిలో ఏకంగా రూ.11 కోట్లుపైగా విలువైన భూములను ఆక్రమించుకున్నారు. వీటిపై అధికారులు చర్యలు తీసుకోకపోవడం శోచనీయం.

తప్పుడు సమాచారంతో..

రూ.5 లక్షల లోపు వార్షికాదాయం ఉన్న దేవదాయ భూములను అర్చకులు సాగు చేసుకోవచ్చని గత వైసీపీ పాలనలో జీవో జారీ చేశారు. దీనిని ఆసరాగా చేసుకుని మండలంలోని పాల్తూరు గ్రామానికి చెందిన ఐదుగురు వైసీపీ నాయకులు రామస్వామి, బసవేశ్వరుడి ఆలయాలకు చెందిన భూమిని కాజేసే కుతంత్రం పన్నారు. సర్వే నంబర్లు 296.. 555ల్లో ఆలయాలకు 34.93 ఎకరాల భూమి ఉంది. ఎకరా రూ.10 లక్షలుపైగా పలుకుతోంది. ఈ భూమిపై ఏడాదికి రూ.5 లక్షలు మాత్రమే ఆదాయం ఉందని తప్పుడు సమాచారం ఇచ్చారు. దీంతో అర్చకులు సాగు చేసుకునేలా ప్లాన్ వేశారు. అర్చకుల స్థానంలో వైసీపీ నాయకులు ఎంటరయ్యారు. గుట్టుగా వైసీపీకి చెందిన రుద్రముని, నాగరాజు, విజయ్‌కుమార్, మల్లికార్జున, బసవరాజు కలిసి 34 ఎకరాల దేవదాయ భూమికి తమ పేర్లతో పట్టాదారు పాసు పుస్తకాలు చేయించుకున్నారు. విషయం తెలిసి అర్చకులే అవాక్కయ్యారు. విచిత్రమేమిటంటే ఆ భూములు గుంతకల్లు బ్రాంచి కాలువ (జీబీసీ)కి ఆనుకుని ఉన్నాయి. కాలువ నీరు అందే భూములు. ఎకరాకి ఏడాదికి రూ.50వేల నుంచి రూ.60వేలు కౌలు ఇస్తున్నారు. ఈ లెక్కన దాదాపు సంవత్సరానికి రూ.15 లక్షల ఆదాయం వస్తుంది. ఆదాయం తక్కువ చూపించి, అర్చకుల స్థానంలో వైసీపీ నాయకులు భూమి కొట్టేశారు. వాస్తవానికి ఆ భూములకు పట్టాదారు పుస్తకాలు చేసుకోవడానికి వీల్లేదు. దేవదాయ శాఖాధికారులు ఇచ్చే సర్టిఫికెట్‌తో భూమిపై రుణా లు మాత్రమే తెచ్చుకునే అవకాశం ఉంటుంది. అయినా.. వైసీపీ నాయకులు ఏకంగా పాసుపుస్తకాలే తెచ్చుకోవడం శోచనీయం.



హావళిగి పరిధి సర్వే నంబరు 8లోని భూమి మఠానికి చెందినదని చూపుతున్న డైక్లాట్

మఠం భూమి.. స్వాహా

మండలంలోని హావళిగి గ్రామ పరిధి సర్వే నంబరు 8లో 31.76 ఎకరాలు కర్ణాటకలోని చింతామణి మఠానికి చెందిన భూమి ఉంది. ఎకరా రూ.10 లక్షలుపైగా పలుకుతోంది. ఆ భూమి మఠం భూమేనని నేటికీ డైక్లాట్‌లో ఉంది. ఆ భూమికి వైసీపీ నాయకులైన అన్నదమ్ములు వేమారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి తమ పిత్రార్జితం అంటూ పట్టాదారు పాసుపుస్తకాలు కూడా చేయించుకున్నారు. వీరిలో ఒకరు తన భాగానికి వచ్చిన భూమి అంటూ వీ కొత్తకోటకు చెందిన ఇద్దరు వ్యక్తులకు విక్రయించాడు కూడా. కోట్ల రూపాయల విలువైన భూములు వైసీపీ నాయకులు అప్పనంగా ఆక్రమించినా.. అధికారులు చోద్యం చూస్తుండడం అనుమానాలకు తావిస్తోంది.

దేవాలయ భూమిని పిత్రార్జితంగా నమోదు చేయించుకున్న వైసీపీ నాయకులు

విచారించి, చర్యలు తీసుకుంటాం

మఠం, ఆలయ భూములకు వైసీపీ నాయకులు పాసుపుస్తకాలు చేయించుకున్న విషయం మా దృష్టికి రాలేదు. దీనిపై విచారించి, ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతాం.

-చంద్రశేఖరయ్య,
తహసీల్దార్, విడపనకల్లు

మా దృష్టికి రాలేదు

దేవాలయ భూమిని బదలాయించుకున్న విషయం మా దృష్టికి రాలేదు. మా రికార్డుల్లో దేవాలయ భూమిగానే ఉంది. దేవదాయ భూములు ఆక్రమించుకున్న వారిపై విచారించి, చర్యలు తీసుకుంటాం. హావళిగి చింతామణి మఠం భూమితో దేవదాయ శాఖకు సంబంధం లేదు.

- రమేష్‌బాబు,
ఇన్‌చార్జి ఈఓ,
విడపనకల్లు

ఆలయానికి ఇచ్చిన భూమి సైతం..

విడపనకల్లు మండలంలోని జనార్దనపల్లి పరిధి సర్వే నంబరు 141లో 42 ఎకరాల భూమి ఉంది. అందులో దాదాపు 21 ఎకరాలు రామస్వామి, పాండురంగస్వామి దేవాలయాల అర్చకుడు కాశీబట్ల గుండూరావు శర్మ పేరున ఉండేది. ఆయన ఏళ్ల క్రితమే అమ్మేశారు. ఆ భూమి పక్కనే అదే సర్వే నంబరులో 21.10 ఎకరాల భూమ ఉంది. ఇది దశాబ్దాల క్రితం శేషమ్మ అనే భక్తురాలు.. ఆలయానికి దానంగా ఇచ్చేసింది. ఈ భూమిపై గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ అనుచరుల కన్ను పడింది. కాశీబట్ల గుండూరావు శర్మ స్థానంలో కరూర్ గుండూరావు శర్మ అనే వ్యక్తిని తీసుకొచ్చారు. ఆ భూమి ఆయనదే అన్నట్లుగా బోగస్ రికార్డులు సృష్టించారు. అతడి నుంచి ముగ్గురు కుమారుల పేరున మార్చారు. వారి నుంచి వైసీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే అనుచరుడి బంధువు పేరుతో ఆ పార్టీ అధికారంలో ఉన్నపుడు 2022లో రిజిస్ట్రేషన్ చేశారు. ఆ మేరకు పాసుపుస్తకాలు కూడా పొందినట్లు సమాచారం. ఓ భక్తురాలు.. ఆలయానికి ఇచ్చిన భూమిని పక్కా స్కెచ్‌తో వైసీపీ వర్గీయుడు కైవసం చేసుకున్నాడు. తహసీల్దారు కార్యాలయంలో పట్టాదారు పాసుపుస్తకాల కోసం దరఖాస్తు చేసిన సమయంలో కొనుగోలు భూమిగా చూపించారు. విక్రయించే సమయంలో పెద్దల నుంచి సంక్రమించిన ఆస్తిగా పేర్కొన్నారు. అలా ఒకచోట కొనుగోలు, మరోచోట అనువంశీకము అంటూ తప్పుడు సమాచారం ఇచ్చి పట్టాదారు పాసుపుస్తకాలు పొందారు. ఈ భూమి విలువ ప్రస్తుతం రూ.5 కోట్లు ఉంటుంది.

ఎస్సీలపై నిర్లక్ష్యం..!

యాక్షన్ ప్లాన్ అమలులో ఎంపీడీఓల అలసత్వం

- కమీషన్లు కుదరకపోవడమే కారణమా..?
- జడ్పీ అధికారుల నిద్రమత్తు
- మొదటి విడతలో రూ.58 లక్షలు వెనక్కు.
- నెలాఖరులోపు వాడకపోతే రెండో విడతా అంతే..
- ప్రధానమంత్రి ఆదర్శ గ్రామయోజన అభాసుపాలు



ఎస్సీ సంక్షేమశాఖ కార్యాలయం

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఎస్సీల సంక్షేమం, అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న పథకాల అమలులో అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఎస్సీ గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన (పీఎంఏజీవై)పేరిట ప్రత్యేక పథకాన్ని తీసుకొచ్చింది. 40 శాతం ఎస్సీ జనాభా ఉన్న గ్రామాలను ఎంపిక చేసి.. అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడమే ఈ పథకం లక్ష్యం. ఎంపీడీఓలు, జడ్పీ అధికారుల నిర్లక్ష్యంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. రెండో విడత కింద ఫిబ్రవరిలో నిధులు విడుదలయ్యాయి. ఈ నెలాఖరులోపు ఖర్చు చేయాల్సి ఉండగా... ఇప్పటి వరకూ ఎలాంటి కదలిక లేదు. ఇక వారం రోజుల్లో పనులు మొదలు పెడతారా అనేది సందేహమే.

పీఎంఏజీవై ఉద్దేశం..

జిల్లాలో అత్యంత వెనుకబడిన, ఎస్సీ జనాభా 40 శాతం ఉన్న గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆయా గ్రామాల్లోని మౌళిక అవసరాల మేరకు ఎస్సీ సంక్షేమశాఖ ద్వారా నిధులు కేటాయిస్తుంది. ప్రణాళికలను సిద్ధం చేసే బాధ్యతను ఎంపీడీఓలు, జడ్పీ అధికారులు చూడాలి. తాగునీటి పైపులైన్లతో పాటు శాశ్వతంగా నీటిసమస్య పరిష్కారానికి ఈ పథకంలో పొందుపరిచింది. నీటి ట్యాంకులు, డ్రైనేజీలు, కల్వర్టులు, రోడ్లు, పాఠశాలలు, హాస్టళ్లు, అంగన్‌వాడీలు, ఆసుపత్రులు, విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పించేందుకు అవకాశం కల్పించింది.

నిధులు వెనక్కు.

జిల్లాలో పీఎంఏజీవై పథకం అమలులో అడుగడుగునా నిర్లక్ష్యం కనిపిస్తోంది. గ్రామాలను ఎంపిక చేయడం... నిధులు రావడం...పనులు జరగక వెనక్కు వెళ్లడం పరిపాటిగా మారింది. 2019-20కి సంబంధించి మొదటి విడత కింద మూడు గ్రామాలను ఎంపిక చేశారు. నార్పల మండలంలోని దుర్గం, గార్లదిన్నెలోని కల్లూరు, పెద్దవడుగూరు మండలంలోని విరుపాపురం ఎస్సీ గ్రామాల్లో తాగునీటి పైపులైన్, డ్రైనేజీ, విద్యుత్, రోడ్లు తదితర అభివృద్ధి పనులు చేసేందుకు ఎంపిక చేశారు. అందుకు సంబంధించి ఎస్సీ సంక్షేమ శాఖ నుంచి దాదాపు రూ. 58 లక్షలు నిధులు విడుదలయ్యాయి. యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి పనులు చేపట్టకపోవడంతో ఆ నిధులు వెనక్కు వెళ్లిపోయాయి.

తాజాగా రెండో విడతలో ఎస్సీ సంక్షేమశాఖాధికారులు మరోమారు రూ. 58 లక్షలు విడుదల చేశారు. ఉరవకొండ మండలంలో పెద్దముష్టూరు, పామిడిలో ఎదురూరు, నార్పలలో సిద్దరాచర్ల, గుత్తిలో రజాపురం, గార్లదిన్నెలో బూదేడు, పెద్దవడుగూరు మండలంలోని మిడుతూరు గ్రామాలను ఎంపిక చేశారు. మార్చి నెలాఖరులోగా నిధులు ఖర్చు చేయాలని గత నెల ఫిబ్రవరిలో నిధులను ఎస్సీ సంక్షేమశాఖాధికారులు జడ్పీ అధికారుల ఖాతాకు జమ చేశారు. ఇంత వరకూ ఒక్క గ్రామంలో ఒక్క పనికూడా మొదలు కాలేదు. ఇక వారం రోజులే సమయం ఉండటంతో మరోమారు నిధులు వెనక్కే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

కమీషన్లు కుదరకపోవడమేనా..?

ఎస్సీ గ్రామాల్లో పనులు చేయకపోవడం వెనక.. సంబంధిత కాంట్రాక్టర్లతో ఎంపీడీఓలకు కమీషన్ల పొత్తు కుదరకపోవడమే ప్రధానకారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రూ. 10 లక్షలకు రూ. 2 లక్షలు చొప్పున కమీషన్లు అడుగుతుండటం... అంత స్థాయిలో కమీషన్లు ఇచ్చుకోలేకమని కాంట్రాక్టర్లు చెబుతుండటం... మరోవైపు కొందరు కాంట్రాక్టర్లు ఇదే విషయంపై స్థానిక అధికార పార్టీ నాయకులతో ఒత్తిళ్లు తెప్పిస్తుండటంతోనే ఆ పనులు ముందుకు సాగడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎప్పటికప్పుడు ఎంపీడీఓలతో సమావేశాలు నిర్వహించాల్సిన జడ్పీ అధికారులు తమకేమీ సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తుండటమూ ఓ కారణమనే చెప్పాలి. ఇప్పటి వరకూ ఎంపీడీఓలతో జడ్పీ అధికారులు ఒక్క సమావేశం నిర్వహించిన పాపాన పోలేదు.



జడ్పీ అధికారులను రోజూ అడుగుతున్నాం

పీఎంఏజీవై పథకంలో భాగంగా మొదటి విడతలో మూడు గ్రామాలను ఎంపిక చేశాం. అందుకు సంబంధించి ఎస్సీ సంక్షేమశాఖ ద్వారా జడ్పీకి రూ.58 లక్షలు విడుదలయ్యాయి. పనులు సకాలంలో జరగకపోవడంతో నిధులు వెనక్కు వెళ్లిపోయాయి. రెండో విడతలో ఆరు గ్రామాలను ఎంపిక చేశారు. అందుకు సంబంధించి నిధులు వచ్చాయి. ఈ నెలాఖరులోపు నిధులు ఖర్చు చేయాల్సి ఉంది. లేదంటే వెనక్కు వెళ్లే పరిస్థితులు ఉన్నాయి. ఈ విషయంపై జడ్పీ అధికారులతో రోజూ పనులపై ఆరా తీస్తున్నాం. త్వరితగతిన చేపట్టాలని చెబుతున్నాం.

-రాధిక, డీడీ, ఎస్సీ సంక్షేమశాఖ



పనులు చేయాలని ఎంపీడీఓలను ఆదేశించాం

పీఎంఏజీవై పథకం కింద మొదటి విడతల నిధులు వెనక్కు వెళ్లిన విషయం వాస్తవమే. ఎంపీడీఓలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నాం. రెండో విడతలో మూడు గ్రామాలకు సంబంధించి రూ. 20 లక్షలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఇప్పటి వరకూ రూ. 10 లక్షలకు సంబంధించిన ప్లాన్ అప్‌లోడ్ అయింది. ఈ నెలాఖరులోపు పనులు మొదలుపెట్టాలని ఎంపీడీఓలను ఆదేశించాం.

-రామచంద్రారెడ్డి, సీఈఓ, జిల్లా పరిషత్

ఆశల పంట నేలరాలి..

అన్నదాత గుండె పగిలి..

లక్ష్మీనారాయణ తోటలో నేలకొరిగిన అరటి పంట



ఆత్మహత్యకు యత్నించిన రైతులు చిన్నవెంగప్ప ↔ లక్ష్మీనారాయణ

యల్లనూరు, మార్చి23(ఆంధ్రజ్యోతి): అప్పులు చేసి సాగుచేసిన పంట నేలరాలింది. రెండ్రోజుల్లో పంట కోయాల్సి ఉండగా.. ఈదురుగాలుల దెబ్బకు మొత్తం నష్టం వాటిల్లింది. దీంతో అన్నదాత గుండె పగిలింది. పొలంలో పడిపోయిన పంటను చూడలేక ఆత్మహత్యకు యత్నించారు ఇద్దరు రైతులు. మండలంలోని నీర్జాంపల్లికి చెందిన రైతులు లక్ష్మీనారాయణ, చిన్నవెంగప్ప అరటి సాగు చేశారు. లక్ష్మీనారాయణ 12ఎకరాల్లో అరటిపంట సాగుచేశాడు. రూ.18 లక్షల వరకు పెట్టుబడి పెట్టాడు. చిన్న వెంగప్ప 9ఎకరాల్లో సాగు చేశాడు. రూ.13 లక్షల వరకు పెట్టుబడి పెట్టాడు. ఒకట్రెండు రోజుల్లో చేతికి రావాల్సి ఉంది. ఇంతలోనే శనివారం సాయంత్రం ఈదురుగాలులకు పంట నేలకొరిగింది. ఉదయాన్నే తోటల్లో పంటను చూసిన రైతులు తీవ్ర మనస్తాపం చెంది అక్కడే కలుపు నివారణ మందు తాగారు. అపస్మారక స్థితిలో పడివున్న వారిని కుటుంబీకులు గమనించి, పులివెందుల ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. రైతులతో ఫోన్‌లో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ మాట్లాడారు. ధైర్యంగా ఉండాలనీ, ఆదుకుంటామని తెలిపారు.

ఆయుష్ డాక్టర్ల

కార్యవర్గం ఎన్నిక



అనంతపురం టౌన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఆయుష్ డాక్టర్ల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని గోకుల్ ఆయుష్ ఆసుపత్రి ఆవరణంలో సమావేశం నిర్వహించారు. జాతీయ నాయకుడు నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు కుమారయ్య, తిరుపతినాయుడు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. తొలుత ఆయుష్ డాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కారానికి అనుసరించాల్సిన కార్యక్రమాలు, అనంతపురంలో ఏప్రిల్‌లో క్యాన్సర్‌పై నిర్వహిస్తున్న సదస్సు ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయుష్ సంఘం జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ శ్రీనివాస్‌నాయక్, ప్రధా న కార్యదర్శిగా డాక్టర్ గౌరీ శంకర్, గౌరవాధ్యక్షుడిగా కేదార్‌నాథ్, కోశాధికారిగా మురళీక్రిష్ణ, సహాయ కార్యదర్శులుగా భూపాల్ రెడ్డి, రియాజ్, సభ్యులుగా మల్లికార్జునగౌడు, రామాంజనేయులు, షేక్షావలి, నీలేష్, మహ్మద్‌రఫీక్, రాజానరసింగరావు ఎన్నికయ్యారని సంఘం నాయకులు ప్రకటించారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.32 (సోమవారం సాయంత్రం)
సెహరీ : 5.05 (మంగళవారం ఉదయం)

నయనమనోహరం

ఘనంగా శ్రీవారి పుష్పయాగం

ముగిసిన ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలు

(వివరాలు 7లో...)

హనీట్రాప్

వాట్సాప్ కాల్‌తో పరిచయం... వీడియో కాల్‌తో బ్లాక్‌మెయిల్

అల్లుడి డైరెక్షన్‌లో అత్త వ్యవహారం.. వందల్లో బాధితులు

పోలీసుల విచారణలో విస్తుపోయే నిజాలు

లేపాక్షి, మార్చి23(ఆంధ్రజ్యోతి): ఆమె వాట్సాప్ కాల్ చేస్తారు. తియ్యటి మాటలతో పరిచయం చేసుకుంటారు. ఆమె మాటలకు అటువైపు వ్యక్తి ఫిదా కావాల్సిందే. ఇలాగే కొద్దిరోజులు వ్యవహారం నడుపుతారు. తమ లైన్‌లోని వచ్చాడని నమ్మకం కుదిరాక వీడియో కాల్ చేసి మాట్లాడుతూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడతారు. ఇదంతా ఓ అల్లుడి డైరెక్షన్‌లో అత్త సాగిస్తున్న వ్యవహారం. అత్త హనీట్రాప్ చేయడం, అల్లుడు సెటిల్‌మెంట్ చేయడం.. ఇవీ లేపాక్షి పోలీసుల విచారణలో వెల్లడైన అంశాలు. వివరాల్లోకి వెళితే లేపాక్షి మండలం కొండూరుకి చెందిన ధనుంజయ కొంత కాలంగా తన అత్తతో పరిచయం లేని వ్యక్తులకు ఫోన్ చేయించి, హనీట్రాప్ చేసి డబ్బులు లాగుతున్నాడు. అయితే లేపాక్షికి చెందిన ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ నెల 17న కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాంకేతికత సాయంతో నిందితులను గుర్తించారు. ఇందులో కొండూరికి చెందిన అల్లుడు ధనుంజయతో పాటు హిందూపురం పట్టణానికి చెందిన అత్త, లేపాక్షి బీసీ కాలనీకి చెందిన రవికుమార్, కొండూరుకి చెందిన రమేష్‌ని పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు.

వీడియో కాల్‌తో ..

హిందూపురం ప్రాంతంలో డబ్బున్న వారి నెంబర్ సేకరించి అత్త వాట్సాప్‌లో వాయిస్ కాల్ మాట్లాడుతుంది. అలా తరచూ కొద్ది రోజులు మాట్లాడుతుంది. ఈక్రమంలో అవతలి వ్యక్తిని రెచ్చకొట్టే విధంగా వ్యాఖ్యలు చేస్తుంది. ఈక్రమంలోనే అవతలి వ్యక్తి ఒక అడుగు ముందుకు వేశాడంటే వీడియో కాల్ ద్వారా ఎక్స్‌పోజింగ్ చేస్తుంది. ఆ వీడియోని అవతలి వ్యక్తికే స్క్రీన్ షాట్‌లు పంపి బ్లాక్‌మెయిల్ చేస్తుంది. డబ్బులు ఇవ్వలేదంటే సోషల్ మీడియాలో షేర్ చేస్తామని, బంధువులకు పంపుతామని బెదిరిస్తారు. చేసేది లేక అడిగినంత ఇచ్చు కోవాల్సిందే. హనీట్రాప్ డైరెక్షన్ అంతా అల్లుడు, అతడి బావ మరిదిదే. వారు చెప్పిన మేరకే స్క్రిప్ట్ ఉంటుంది. వారు చెప్పిన వ్యక్తిని ట్రాప్‌లోకి దింపుతుంది. వారు దిగారని తెలిసిన వెంటనే అవతలి వ్యక్తిని బ్లాక్‌మెయిల్ చేస్తారు.

వందల్లో బాధితులు?

హనీట్రాప్ విషయంగా పోలీసులకు ఫిర్యాదు చేసింది ఒక్కడే. ఎందుకంటే ధనుంజయ అనే వ్యక్తికి చాలా మంది భయపడతారు. అతడు గతంలో ఓ పత్రికలో పని చేయడమే కారణం. దీంతో పాటు ఆర్‌టీఐ కింద అధికారులను బెదిరించడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. ఈ నేపథ్యంలో సమస్య ఎందుకని అడిగినంత ఇచ్చుకుంటు న్నారు. ఒక హిందూపురం నియోజకవర్గంలో వందల సంఖ్యలో వీరి బాధితులు ఉన్నారంటే హనీట్రాప్ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. ధనుంజయ గతంలో ఒక వీఆర్‌ఓని ఇంటికి పిలిపించుకొని లక్షల్లో డబ్బును గుంజారు. తాజాగా మరో వీఆర్‌ఓపై కన్నేశారు. వీరి బెదిరింపులకు తాళలేక ఒక వ్యక్తి మృతి చెందాడు. వీరు సుమారు. రూ. 4 కోట్ల వరకు గుంజినట్లు సమాచారం. ఫిర్యాదు చేయడానికి బాధితులు ఎవరూ ముందుకు రాలేదు. అందులో ఎక్కువ శాతం అధికారులే ఉండటం కారణం.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ


తోఫా అందజేస్తున్న అంబికా లక్ష్మీనారాయణ, షెక్షావలి

అనంతపురం కల్చరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాల్లో ఉన్నవారితో సహా అందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయం అని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని విశ్రాంత ఎస్పీ షెక్షావలి ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని లలితకళా పరిషత్‌లో నిర్వహించిన రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమానికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతోపాటు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి, జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం ముస్లింల సంక్షేమం కోసం బడ్జెట్‌లో రూ.5400కోట్లు కేటాయించారని అన్నారు. రంజాన్ పండుగను ప్రతిఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి మాట్లాడుతూ.. ముస్లింలకు రంజాన్ తోఫా, దుల్హన్ ప థకం, మౌజాన్‌లు, ఇమామ్‌లకు గౌరవ వేతనాలు ప్రవేశపెట్టింది చంద్రబాబునాయుడేనని గుర్తు చేశారు. విశ్రాంత ఎస్పీ షెక్షావలి ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆశాబేగం, మాజీ డిప్యూటీ మేయర్ గంపన్న, వడ్డెర సంఘం మాజీ అధ్యక్షుడు దేవళ్ల మురళి, ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బాషా, సామాజిక కార్యకర్త జాకీర్, రాజకుల్లాయప్ప, అల్తాఫ్, మసూద్, ప్రభుత్వ ఖాజీ అబ్దుల్ మాజీద్ పాల్గొన్నారు.

నయనమనోహరం.. శ్రీవారి పుష్పయాగం

ముగిసిన ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలు

కదిరి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): శ్రీఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి పుష్పయాగోత్సవం నయన మనోహరంగా సాగింది. ఉదయం ఆలయ సంప్రోక్షణ, శుద్ధి, పరివార దేవతల అభిషేకం, గోపూజ, హోమాది కార్యక్రమాలు చేశారు. అనంతరం యాగశాల నుంచి స్వామి వారి కుంభం, కలశాన్ని గర్భాలయంలోకి తీసుకొచ్చారు. మధ్యాహ్నం స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 12 రకాల పుష్పాలతో యాగోత్సవం నిర్వహించారు. స్వామివారు, భూదేవి, శ్రీదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలకంరించారు.


పుష్పయాగంలో శ్రీవారు

ముగిసిన బ్రహ్మోత్సవాలు

శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి నిర్వహించిన పుష్పయాగోత్సవంతో ముగిశాయి. 15 రోజులపాటు అత్యంత వైభవంగా జరిగాయి. అంకురార్పణ నుంచి పుష్పయాగం వరకు ప్రతి ఉత్సవంలో శ్రీవారు భక్తులకు కనువిందు చేశారు.


స్వామివారి సేవకు తెప్పించిన పుష్పాలు

ఖాద్రీశుడి సన్నిధిలో

జిల్లా ప్రధాన న్యాయాధికారి

కదిరిలీగల్(ఆంధ్రజ్యోతి): ఖాద్రీ శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాస్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. స్థానిక న్యాయాధికారి జయలక్ష్మి, సిబ్బంది వెంట రాగా జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్.. స్వామివారి దర్శనానికి ఆదివారం వచ్చారు. న్యాయాధికారికి తూర్పురాజగోపురం వద్ద ఆలయ సహాయ కమిషనర్, సిబ్బంది స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. న్యాయాధికారికి శ్రీవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేసి, దుశ్శాలువాతో సన్మానించారు. శ్రీవారి పుష్పయాగోత్సవంలో జిల్లాన్యాయాధికారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అంతకుముందు విశ్రాంతి భవనం వద్ద గౌరవపూర్వకంగా స్థానిక న్యాయవాదులు.. జిల్లా న్యాయాధికారిని కలిశారు.


ఆలయ ప్రదక్షిణ చేస్తున్న న్యాయాధికారి



ఈదురుగాలుల బీభత్సం

తోడైన వడగళ్ల వాన.. భారీగా దెబ్బతిన్న ఉద్యాన పంటలు

అనంత జిల్లాలోనే రూ.34.91 కోట్ల నష్టం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం రాత్రి వీచిన ఈదురుగాలులకు పలు ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. ఈ గాలులకు వడగళ్ల వాన తోడవడంతో నష్టం తీవ్రత పెరిగింది. ముఖ్యంగా అరటి, బొప్పాయి, దానిమ్మ, మొక్కజొన్న పంటలు బాగా దెబ్బతిన్నాయి. అక్కడక్కడ వేరుశనగ పంటకు నష్టం జరిగినట్లు రైతులు పేర్కొన్నారు. వడగళ్ల దెబ్బకు కాయలు నల్లగా మారడంతో అరటిని కొనేందుకు వ్యాపారులు ముందుకు రారని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట కోత కోసే సమయంలో ఈదురు గాలులు తమ ఆశలను చెదరగొట్టాయని వారు కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

అనంతపురం అర్బన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో 9 మండలాల్లో రూ.34.91 కోట్ల విలువైన ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. కోత దశలోని అరటి, బొప్పాయితోపాటు మామిడి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. పుట్లూరు, యల్లనూరు, యాడికి, శింగనమల మండలాల్లో అత్యధికంగా 557.20 హెక్టార్లల్లో రూ.34.82 కోట్ల విలువైన అరటి పంట దెబ్బతింది. 2 హెక్టార్లల్లో రూ.7.50 లక్షల విలువైన బొప్పాయి పంట, రూ.లక్ష విలువైన మామిడి పంట దెబ్బతిన్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 559.60 హెక్టార్లల్లో రూ.34.91 కోట్లు విలువైన ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. యల్లనూరు, పుట్లూరు మండలాల్లో 35 హెక్టార్లలో రూ.30.09 లక్షల విలువైన మొక్కజొన్న దెబ్బతింది. భారీ ఈదురుగాలుల ప్రభావంతో కంకి ఏర్పడే దశలోని మొక్కజొన్న నేలకొరగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు వేడుకుంటున్నారు.

ఫోన్‌లో పరామర్శించిన మంత్రి

ఈదురుగాలులకు నష్టపోయిన మండలంలోని పలువురు అరటి రైతులను రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఫోన్‌లో ఆదివారం పరామర్శించారు. అధికారుల నుంచి తగిన నివేదికలు తెప్పించుకుని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

335 ఎకరాల్లో పంట నష్టం

పుట్లూరు: మండలంలో శనివారం అర్ధరాత్రి గాలివానకు పెద్దఎత్తున ఉద్యాన పంటలతోపాటు మొక్కజొన్న పంట దెబ్బతింది. 300ఎకరాల్లో అరటి, 5ఎకరాల్లో బొప్పాయి, 26ఎకరాల్లో మొక్కజొన్న, 4ఎకరాల్లో మామిడిపంటలు నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. కుమ్మనమల, కొండుగారికుంట, రంగమనాయునిపల్లి, రంగరాజుకుంట, ఎల్లుట్ల, జంగంరెడ్డిపేట, మడ్డిపల్లి, కడవకల్లు, ఓబులాపురం, చెర్లోపల్లి తదితర గ్రామాల్లో పంట నష్టం జరిగింది. చేతికి వచ్చిన పంట గాలివానకు దెబ్బతినడంతో పెట్టిన పెట్టుబడులు కూడా రావని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల వడగళ్ల వాన పడటంతో అరటికాయలకు, ఆకులకు నల్లటి మచ్చలు పడ్డాయి. దెబ్బతిన్న పంటను వ్యాపారులు సగం ధరలకు కూడా కొనుగోలు చేయరని వాపోతున్నారు.

20 ఎకరాల్లో దెబ్బతిన్న వేరుశనగ

యాడికి(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిన్నేపల్లి గ్రామంలో శనివారం కురిసిన వర్షానికి పలువురు రైతులు వేరుశనగ పంటను నష్టపోయారు. పిన్నేపల్లి గ్రామానికి చెందిన కొత్తరాయుడు, మరో ఆరుగురు రైతులు బోరుబావుల కింద వేరుశనగ సాగుచేశారు. శుక్ర, శనివారాల్లో పంటను కోశారు. వేరుశనగ కాయలు తొలగించక ముందే శనివారం రాత్రి అకాలవర్షం కురవడంతో తీవ్రంగా నష్టపోయినట్లు రైతులు తెలిపారు. పిన్నేపల్లి గ్రామంలో సుమారు రూ.10లక్షల మేర వేరుశనగ పంట నష్టం జరిగినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

రూ.3 కోట్లకుపైగా..

తాడిమర్రి: మండలంలోని శనివారం రాత్రి వీచిన గాలులకు దాడితోట, తురకవారిపల్లి, నాయనపల్లి గ్రామాలలో అరటి, దానిమ్మ, మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. 82 మంది అరటిరైతులకు సంబంధించి 77.50 హెక్టార్లలో అరటిపంట పూర్తిగా నేలమట్టమైంది. ఆరు హెక్టార్లలో మొక్కజొన్న, రెండు హెక్టార్లలో దానిమ్మ పంట పూర్తిగా దెబ్బతింది. తెల్లవారితే టన్ను రూ.17వేలతో పంట కోస్తారని ఎదురుచూసిన రైతుల ఆశలను ఈదురు గాలులు చెదరగొట్టాయి. దాదాపు రూ.3కోట్లకు పైగా నష్టం వాటిల్లి ఉంటుందని అధికారులు ఒక అంచనాకు వచ్చారు. స్థానిక తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, హార్టికల్చర్ అసిస్టెంట్ రామాంజనేయులు దెబ్బతిన్న పంటలను పరిశీలించి, నష్టం వివరాలు నమోదు చేసుకుని ఉన్నతాధికారులకు పంపారు.

రైతులను ఆదుకుంటాం: ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

శింగనమల(ఆంధ్రజ్యోతి): వర్షం కారణంగా నియోజకవర్గంలోని చాలా మండలాల్లో పంటనష్టం వాటిల్లిందని, ప్రతి రైతును ఆదుకుంటామని శింగనమల ఎమ్మెల్యే శ్రావణిశ్రీ అన్నారు. పుట్లూరు, యల్లనూరు, శింగనమల, బుక్కరాయసముద్రం, నార్పల, గార్లదిన్నె మండలాల్లో అరటితోపాటు ఇతర పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. పంట నష్టంపై అంచనా వేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు.




పుట్లూరు మండలంలో ఈదురుగాలులకు పడిపోయిన బొప్పాయి


నేలకొరిగిన అరటి గెలలను చూపుతున్న రైతు

28 ఎకరాల్లో అరటి పంట నష్టం

గుబ్బ: మండలంలోని చిత్రవాండ్లపల్లి, ఈదులపల్లి, ఇందుకూరు, కొడవాండ్లపల్లి గ్రామాలలో ఈదురుగాలుల దెబ్బకు అరటి పంట 28 ఎకరాలలో దెబ్బతిన్నట్టు వ్యవసాయ అధికారులు తెలిపారు. దెబ్బతిన్న అరటి పంటను ఆదివారం అధికారులు పరిశీలించారు. గాలి బీభత్సానికి జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.

తక్కువ ధరకు అడుగుతున్నారు



నాలుగు ఎకరాల్లో 5వేల అరటిచెట్లను సాగు చేశా. వాటిలో గాలివానకు 1500చెట్లు పడిపోయాయి. కిందపడిపోయిన కాయలను అతితక్కువ ధరకు అడుగుతున్నారు. లక్షల రూపాయలు పెట్టుబడిపెట్టి ప్రస్తుతం ఉన్న ధరకన్నా ఇంకా సగం ధరకు అమ్మలేకున్నాం. కానీ గత్యంతరం లేక వ్యాపారులు అడిగిన ధరకే ఇస్తున్నాం. ప్రభుత్వమే వ్యాపారస్తులతో కొనుగోలు చేయిస్తే బాగుంటుంది.

- జగదీష్, రైతు, రంగమనాయునిపల్లి

పూర్తిగా నష్టపోయా..



నేను నాలుగు ఎకరాల్లో 5500 అరటి చెట్లు సాగుచేశా. వాటిలో గాలివానకు 4800 చెట్లు పూర్తిగా పడిపోయాయి. వారంరోజుల క్రితం వ్యాపారులు టన్ను రూ.17వేలతో అడిగారు. అమ్ముదామనేలోగా గాలివానకు అరటితోట పూర్తిగా పడిపోయింది. ఇప్పుడు సగం ధరకు కూడా అడగరు. ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యం.

-ఆదినారాయణరెడ్డి, రైతు, రంగరాజుకుంట

తెల్లారితే డబ్బు వస్తుందనుకున్నా..



సోమవారం అరటి పంటకు డబ్బులు వస్తాయి. మందుల అంగడిలో ఉన్న అప్పులు కట్టి ఇంటిఖర్చుల కోసం చేసిన అప్పులు తీరుతాయని అనుకున్నా. కానీ పూర్తిగా నష్టపోయా, ఈదురుగాలికి పడిపోయిన పంటను ఎవరు కొనేందుకు ముందుకురారు. దీంతో అరటిగెలలను గొర్రెలు, మేకలకు ఇచ్చుకోవాల్సిందే కానీ కొనడానికి ఎవరు ముందుకురారు.

-నరేశ్, రైతు, తురకవారిపల్లి

కాలేజీ ఫీజుకు వస్తుందనుకున్నా..



నా కుమారుడు పదో తరగతి పరీక్షలు రాస్తున్నాడు. ఇంటర్‌కు ఫీజులు కట్టేందుకు అరటి పంట ద్వారా డబ్బులు వస్తాయనుకున్నా. పంట పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీర్చుకోవాలనుకున్నా. కానీ అవేవి జరగకుండానే పంట పూర్తిగా దెబ్బతింది. ఈ రోజు ఉదయం ఫోన్‌చేసి గెలలు ఈ రోజే తీసుకెళ్లాలని వ్యాపారులను కోరితే ఆ పంట మాకొద్దు ఇచ్చిన అడ్వాన్స్ కూడా వెనక్కి ఇవ్వాలని అడుగుతున్నారు.

- భక్తవత్సలంనాయుడు, రైతు, తురకవారిపల్లి

17 మందిపై కేసు

తాడిపత్రి, మార్చి23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిన్నబజారులో వైసీపీ కౌన్సిలర్ ఫయాజ్‌బాషా ఇంటివద్ద రెండురోజుల కిందట టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య దాడులకు సంబంధించి ఆదివారం 17మందిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. దాడుల్లో గాయపడ్డ టీడీపీ మద్దతుదారుడు వరుణ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వైసీపీ కౌన్సిలర్ ఫయాజ్‌బాషా, డీవీకుమార్, ఆర్‌సీ ఓబులరెడ్డి, చవ్వా రాజశేఖర్‌రెడ్డి, గూడూరు లక్ష్మిరంగయ్యతోపాటు మరో 12మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వ్యభిచార కేంద్రంపై పోలీసుల దాడి

గార్లదిన్నె, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మంపేట సమీపంలోని ఓ చీనీ తోటలో నిర్వహిస్తున్న వ్యభిచార కేంద్రంపై ఆదివారం పోలీసులు దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారు తెలిపిన వివరాల మేరకు.. తిమ్మంపేటకు చెందిన బాబు అనే వ్యక్తి వివిధ ప్రాంతాల నుంచి మహిళలను తీసుకువచ్చి గ్రామ సమీపంలో ఓ చీనీ తోటలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారంతో ఎస్‌ఐ మహమ్మద్ గౌస్‌బాషా.. సిబ్బందితో కలిసి వ్యభిచారం కేంద్రంపై దాడి చేశారు. వ్యభిచార కేంద్రం నిర్వహిస్తున్న బాబుతో పాటు ఓ మహిళను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చిరుధాన్యాలపై జీఎస్టీ రద్దు చేయాలి

-శాస్త్రవేత్త ఖాదర్‌వలి

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాలపై జీఎస్టీ రద్దు చేయాలని, కనీస మద్దతు ధర నిర్ణయించాలని స్వతంత్ర శాస్త్రవేత్త ఖాదర్‌వలి డిమాండ్ చేశారు. స్వచ్ఛంద సంస్థలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో కలిసి అనంత సుస్థిర వ్యవసాయ వేదిక ఆధ్వర్యంలో పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌లో మూడు రోజులపాటు సాగే చిరుధాన్యాల మేళా (మిల్లెట్ ఫెస్టివల్) ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా స్వతంత్ర శాస్త్రవేత్త ఖాదర్‌వలి 'చిరుధాన్యాలతో ఆరోగ్యం' అనే అంశంపై మాట్లాడుతూ...ఎరువుల సబ్సిడీలు ఇచ్చే విధానం, ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ బియ్యం పంపిణీతో ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందన్నారు. మిల్లెట్లపై జీఎస్టీ ఎత్తివేయాలని, 10రకాల చిరుధాన్యాలకు కనీస మద్దతు ధర నిర్ణయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని, ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి, వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏపీ మిల్లెట్స్ రీసెర్చ్ చీఫ్ చంద్రమోహన్‌రెడ్డి, నాబార్డు డీడీఎం అనురాధ, సీసీడీ వ్యవస్థాపక కార్యదర్శి త్రిలోచన్ శాస్త్రి, రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రకృతి వ్యవసాయ వేదిక సభ్యులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

లారీ దగ్ధం

తిమ్మంపేట వద్ద ఘటన



దగ్ధమవుతున్న గోధుమల లారీ

గార్లదిన్నె, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరు సమీపంలోని తిమ్మంపేట వద్ద 44వ జాతీయ రహదారిపై ఆదివారం ఓ లారీ దగ్ధమయ్యింది. పోలీసులు తెలిపిన మేరకు రాజస్థాన్ రాష్ట్రంలోని ఝైరైనా జిల్లాకు చెందిన డ్రైవర్ గాంధార్ సింగ్, క్లీనర్ రామ్‌ధీర్ ఇద్దరు ఈనెల 20న గోధుమల లోడుతో బెంగళూరుకు బయల్దేరారు. మూడురోజుల నుంచి ప్రయాణించడంతో వాహనం వేడెక్కిందని డ్రైవర్ ఆదివారం తెల్లవారుజామున తిమ్మంపేట వద్ద 44వ జాతీయ రహదారి పక్కనే నిలిపి నిద్రపోయాడు. అయితే అప్పటికే వేడెక్కి ఉండటంతో ఇంజన్‌లో నుంచి మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన లారీ డ్రైవర్, క్లీనర్‌తో కలిసి మంటలను ఆదుపుచేసేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందచేశారు. ఎస్‌ఐ మహమ్మద్‌గౌస్‌బాషా సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆదుపు చేసేందుకు ప్రయత్నించారు. చివరకు అగ్నిమాపక యంత్రం సాయంతో మంటలను అదుపు చేశారు. అప్పటికే లారీ క్యాబిన్ పూర్తిగా కాలిపోయింది. లారీలోని గోధుమలు కొద్దిగా కాలిపోయాయి. ప్రమాదంలో సుమారు రూ.40 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లినట్లు పోలీసులు ప్రాథమిక అంచనా వేశారు.

శభాష్... శివతేజా..

● బాడీబిల్డర్‌ను అభినందించిన డీఆర్‌ఓ



శివతేజను అభినందిస్తున్న డీఆర్‌ఓ మలోల

అనంతపురం టౌన్, మార్చి23 (ఆంధ్రజ్యోతి): బాడీ బిల్డర్ శివతేజను జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) మలోల అభినందించారు. ఇటీవల శివతేజ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో జరిగిన 80 కేజీల విభాగంలో మిస్టర్ ఇండియా, మిస్టర్ సౌత్‌ఇండియా, మిస్టర్ ఆంధ్రా, మిస్టర్ కర్ణాటక, మిస్టర్ హైదరాబాద్ బాడీ బిల్డర్ పోటీలలో పాల్గొని సత్తాచాటి అవార్డులు కైవసం చేసుకున్నారు. ఆదివారం కోర్టు రోడ్డులోని జిమ్‌లో ఏర్పాటు చేసి న సత్కార కార్యక్రమంలో డీఆర్‌ఓ మలోల పాల్గొని మోమెంటో అందించి శభాష్ శివతేజా అని అభినందించారు. కఠోరదీక్షతో ముందుకు సాగి అనంతకీర్తిని దేశస్థాయికి తీసికెళ్లాలని ఆకాంక్షించారు.

ఎస్సీ వర్గీకరణకు ఆమోదంపై సంబరాలు

శింగనమల, మార్చి 23(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ తీర్మానం అమోదం పొందిన నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ పెసిడెంట్ బండారు చంద్ర, ఎంఈఎఫ్ నాయకులు నల్లప్ప తదితరులు స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం సంబరాలు చేసుకున్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవ స్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కేక్ కట్ చేసి, ఆనందం పంచుకున్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పీజీ నల్లప్ప, సురేష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

అనంతపురంరూరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి):మండలంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక ప్ర దర్శనలు ఆకట్టుకున్నాయి. నగరానికి చెందిన హిమజ బృందం ఆధ్వర్యంలో భరతనాట్యం, దుర్గం బృందం కోలాటం, నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో సంధ్య మూర్తి, ఏటీ శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

బియ్యం పట్టివేత

గార్లదిన్నె, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముంటిమడుగు సమీపంలో 32 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్, రెవెన్యూ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. ముంటిమడుగు, కల్లూరు గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు పలు గ్రామాల్లోని ప్రజల నుంచి రేషన్ బియ్యాన్ని తక్కువ రేటుకు కొనుగోలు చేసి, కర్ణాటక ప్రాంతానికి తరలిస్తూ సొమ్ము చేసుకునేవారు. అందులో భాగంగా 32 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సేకరించి నిల్వ ఉంచినట్లు సమాచారం రావడంతో విజిలెన్స్, రెవెన్యూ అధికారులు దాడులు చేశారు. విజిలెన్స్ అధికారులు వస్తున్నట్లు విషయం తెలుసుకున్న వ్యాపారులు పరారయ్యారు. వారు నిల్వ ఉంచిన 32 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, పోలీసులకు అప్పగించినట్లు సీఎస్‌డీటీ హరిప్రియ తెలిపారు.

కోడిపందెం ఆడుతున్న ఐదుగురి అరెస్ట్

గార్లదిన్నె, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కేశాపురం సమీపంలో ఆదివారం రాత్రి కోడి పందేలు ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ మహమ్మద్‌గౌస్‌బాషా తెలిపారు. గ్రామానికి చెందిన ఐదుగురు కోడి పందెం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి వారిని అరెస్టు చేశామన్నారు. కోళ్లను వారి వద్ద నుంచి రూ.4,100 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గొర్రెల అపహరణ

కనగానపల్లి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్తాపురం గ్రామంలో కల్లం దొడ్డిలో ఉన్న గొర్రెలను దుండ గు లు అపహరించుకుని వెళ్లినట్లు బాధితులు తెలిపారు. గ్రామా నికి చెందిన అంజన్‌రెడ్డి తనకున్న 13 గొర్రెలను రోజు మాదిరి గానే కల్లములో కట్టివేసి వేరుశనగ పంటకు కావలి వెళ్లాడు. అతడు ఆదివారం తెల్లవారు జామున కల్లానికి వచ్చి చూడగా గొర్రెలు కనపడలేదు. చుట్టుపక్కల వెతికినా వాటి జాడ తెలియక పోవడంతో దుండగులు అపహరించారని భావించి, కనగానపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపాడు. గ్రామం లో వరుసగా దొంగతనాలు జరుగుతున్నాయని పోలీసులు నిఘా ఉంచి దొంగల బారి నుండి కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

తారురోడ్డు వేయడంపై హర్షం

రామగిరి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండల పరిదిలోని కొత్తగాది కుంట గ్రామం నుంచి పీఆర్‌కొట్టాల గ్రామం మీదుగా కొత్తగేరికి తారురోడ్డు ఏర్పాటుచేయడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు కొన్నేళ్లుగా తారురోడ్డు లేకపోవడంతో గుంతల రోడ్డుతో ఇబ్బందులు పడుతుండేవారు. తారురోడ్డు వేయడంతో పీఆర్ కొట్టాల గ్రామస్థులు ఎమ్మెల్యే పరిటాల సునీత, యువనేత పరిటాల శ్రీరామ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పీడిస్తున్న పశుగ్రాసం కొరత

● ఆకాశాన్నంటుతున్న గడ్డి ధరలు
● భారమవుతున్న పశువులు, గొర్రెల పెంపకం



వరిగడ్డిని కొనుగోలు చేసి తీసుకెళుతున్న రైతులు

కనగానపల్లి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): వ్యవసాయం తరువాత పశువులు, గొర్రెలు, మేకలు పెంపకం ఇక్కడి రైతుల జీవానాధారం. పశుగ్రాసం కొరతతో ధరలు ఆకాశాన్నంటుతుంటంతో మూగజీవాల పెంపకం రైతులకు భారంగ మారింది. అరకొరగా గ్రాసం తింటూ మూగజీవాలు అలమటిస్తున్నాయి. రాష్ట్రంలోనే కనగానపల్లి మండలం గొర్రెలు, మేకలు పెంపకంలో ప్రథమ స్థానంలో ఉంది. ఇక్కడ విశాలమైన మైదానాలు, కొండలు, గుట్టలు ఉండ టంతో ఎక్కువ మంది ప్రజలు గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఒక్క కనగానపల్లి మండలంలోనే లక్షా అరవై వేలు గొర్రెలు, మేకలున్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఇక రాప్తాడు నియోజవర్గంలోని ఆరు మండలాల్లో దాదాపు 10 లక్షలు గొర్రెలు, మేకలు ఉండగా, 12వేల వరకు ఆవులు, ఎద్దులు, గేదెలున్నాయి. ఈ యేడాది రికార్డు స్థాయిలో ఎండలు మండిపోతుండటంతో పచ్చిక బయళ్లు ఎండుబారాయి. కొండలు, గుట్టలు , మైదానాల్లో ఎక్కడ చూసినా ఎండుగడ్డే కనబడుతోంది. ఆ ఎండు గడ్డినే మేస్తూ మూగజీవాలు కడుపు నింపుకొంటు న్నాయి. కొందరు ఆకతాయిలు ఎండుగడ్డికి నిప్పు పెడుతుండంతో అది కూడా జీవాలకు అందకుండా పోతోంది. దీనికి తోడు సమీప వాగుల్లో కుంటల్లో నీరు లేకపోవడంతో మూగజీవాలు తాగునీటికి కూడా అలమటించేపరిస్థితి నెలకొంది.

ఆకాశాన్నంటిన ధరలు

ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్స రం పశుగ్రాసం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. గొర్రెల పెంపకంపైనే ఆధారప డ్డ కాపరులు ధర ఎంత పెరిగినా కొనుగోలు చేసి వాటిని మేపుతు న్నారు. ప్రస్థుతం ట్రాక్టరు వరిగడ్డి రూ.20వేలు ఉండగా, వేరుశనగ పొట్టు రూ. 40 వేలు ఉందని రైతులు తెలిపారు.

ప్రభుత్వం పశుగ్రాసం అందించాలి



ప్రస్తుతం పశుగ్రాసం దొరక్క పశువుల పెంపకం భారంగా ఉంది. పశుగ్రాసం దొరక్క పోతులనాగేపల్లి నుంచి రూ.20వేలు చెల్లించి ట్రాక్టరు వరిగడ్డి కొనుగొలు చేశాను. ప్రభుత్వం గతంలో మాదిరి సబ్సిడీతో పశుగ్రాసం అందించి ఆదుకోవాలి.

-క్రిష్ణారెడ్డి, పాడిరైతు, మామిళ్ళపల్లి

ఉపాధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పాడి రైతుల కోసం ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా గడ్డి పెంపకం చేపడుతోంది. ఒక్కో రైతుకు ప్రభుత్వం రూ.32 వేల వరకు రాయితీ ఇస్తోంది. దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. దాణా కోసం నివేదికలు పంపాం.

-సునీల్‌కుమార్, పశువైద్యాధికారి, కనగానపల్లి



పొలంలో ఎండుగడ్డిని మేస్తున్న గొర్రెలు

ఘనంగా మహిళా దినోత్సవం

అనంతపురం టౌన్, మార్చి23(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఆదివారం అమరావతి మహిళా జేఏసీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి ఆనందం పంచుకున్నారు. ముఖ్య అతిథులుగా అమరావతి జేఏసీ చైర్మన్ దివాకరరావు, సీనియర్ నాయకుడు పగడాల మల్లికార్జున హాజరయ్యారు. కార్యక్రమంలో మహిళా జేఏసీ నాయకులుహేమలత, మేరీ, రంగమ్మ, లావణ్య, మౌనిక, తిప్పమ్మతో పాటు పెద్దఎత్తున మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉగాది మహిళా పురస్కారాల అందజేత

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి23(ఆంధ్రజ్యోతి): బాలా త్రిపుర సుందరి దేవి సేవా ట్రస్టు వారు ఉగాది మహిళా పురస్కారాలు అందజేశా రు. సమాజ సేవలో పునరంకితులైన ఉత్తమ మహిళలకు ఆ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సుభాష్‌రోడ్డులోని శ్రీకృష్ణ దేవరాయ భవన్‌లో పురస్కారాలు అందజేశారు. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, పలువురు మహిళలను ట్రస్టు వ్యవస్థాపకులు విశ్వనాథ్ మెమెంటో, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్టు ఏపీ చైర్మన్ మహేష్‌బాబు, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి ప్రెసిల్లా, జాస్మి సుధీర్, అంజనా దేవి, విష్ణుప్రియ, అర్బన్ బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా విశ్వేశ్వరరావు

అనంతపురం సెంట్రల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మాజీ సైనిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లాకు చెందిన విశ్వేశ్వర రావు ఎన్నికయ్యా రు. ఆదివారం విజయవాడలో నిర్వహించిన ఎన్నికల్లో నిర్వహించినట్లు విశ్వేశ్వరరావు తెలిపారు. దీనిపై జిల్లాకు చెందిన మాజీ సైనికులు సుదర్శనరెడ్డి, రమేష్‌రెడ్డి, రమేష్‌కుమార్ రెడ్డి, సురేంద్ర, మురళి, జైచంద్ర పెద్దారెడ్డి, బీసీ ఆంజనేయులు, ఎమ్మెస్ ప్రసాద్, నల్లపురెడ్డి, తిరుపాల్ రెడ్డి తదితరు హర్షాన్ని వ్యక్తంచేశారు.

దానధర్మాలకు ప్రతీక రంజాన్

అనంతపురం కల్చరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): దానధర్మాలకు ప్రతీక రంజాన్ మాసం అని రషీద్ అహ్మద్ మెమోరియల్ ట్రస్టు నిర్వాహకురాలు ముర్షిదా బేగం పేర్కొన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని అల్ అమీన్ చారిటబుల్ ట్రస్టు, రషీద్ అహ్మద్ మెమోరియల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం గుత్తిరోడ్డులోని అల్ అమీన్ దర్గా వద్ద పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేపట్టారు. దాదాపు వెయ్యిమంది పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. రషీద్ అహ్మద్ మెమోరియల్ ట్రస్టు ప్రతినిధులు అర్షద్, ఆదాం, హఫీజ్, ఆల్‌మేవా ఫకృద్దీన్, ఇమ్రాన్, జబ్బర్, ఇలియాజ్, అంజుమ్, కలీమ్ పాల్గొన్నారు.

ఘన నివాళి



యోగాసనాలు వేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పతంజలి హనుమాన్ యోగశాల ఆధ్వర్యంలో ఆదివారం హౌసింగ్‌బోర్డులోని భక్తాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో అమరవీరుల బలిదాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమరవీరులు భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గురు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సామూహిక యోగాసనాలు వేసారు. కార్యక్రమంలో కోదండరాంజి, రంగనాయకులు, ఉమాకాంత్, రవి, యోగా కార్యకర్తలు పాల్గొన్నారు.

విప్లవ వీరుల ఆశయాలను కొనసాగిద్దాం

● పలువురు వక్తలు



ఆర్ట్స్ కళాశాలలో భగత్‌సింగ్‌కు ఏఐఎస్ఎఫ్ నాయకుల నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ సైనికులు

అనంతపురం విద్య, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): విప్లవ వీరులు భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గురు ఆశయాలను కొనసాగిద్దామని వక్తలు, విద్యార్థి సంఘాల నేతలు పిలుపునిచ్చారు. భగత్ సింగ్ 94వ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం నగరంలోని పలు ప్రాంతాల్లో, పలు సంఘాలు వేర్వేరుగా ఆయన వర్ధంతిని నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్ట్స్ కళాశాలలోని భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యాలయంలో భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు. ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కుళ్లాయిస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు నరసింహ యాదవ్, వంశీ, నాయకులు మంజునాథ్, రాధాజ్యోతి, లలిత తదితరులు పాల్గొన్నారు. నగరంలోని కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో పీఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రతిభా భారతి అధ్యక్షతన భగత్ సింగ్ వర్ధంతిని నిర్వహించారు. ప్రముఖ న్యాయవాది వీరూ యాదవ్, ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ ఆలం, ఆదినారాయణ, మేరీ మాధురి, దాసి రెడ్డి, తదితరులు పాలొన్నారు.

● అనంతపురం ప్రెస్‌క్లబ్: మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కెప్టెన్ షేకన్న ఆధ్వర్యంలో ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం కోశాధికారి తిమ్మారెడ్డి, సభ్యులు ఈశ్వరయ్య, సంజీవకుమార్, బీపీ హుస్సేన్, వై ప్రసాద్, మహబూబ్ పీరా తదితరులు పాల్గొన్నారు.

● అనంతపురం కల్చరల్: ఐద్వా ఆధ్వర్యంలో స్థానిక గణేనాయక్ భవన్‌లో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్యామలమ్మ, చంద్రిక, సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, ఐద్వా నగర కార్యదర్శి ఫర్హాది తదితరులు పాల్గొన్నారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో రెండో రోడ్డులోని డీవైఎఫ్ఐ కార్యాల యంలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కసాపురం రమేష్, నాయకులు నూరుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్ అనంతపురం



ఓవరాల్ చాంపియన్‌షిప్ దక్కించుకున్న అనంతపురం జేఎన్టీయూ జట్టు

కలికిరి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మూడు రోజులు జరిగిన ఇంటర్ కాలేజీ క్రీడా పోటీల్లో అనంతపురం జేఎన్టీయూ కళాశాల ఓవరాల్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. టేబుల్ టెన్నిస్ (పురుషుల సింగిల్స్, పురుషులు డబుల్స్)లో విన్నర్‌గా జేఎన్టీయూ అనంతపురం, రన్నర్‌గా ఎన్‌బీకేఆర్, నెల్లూరు నిలిచారు. టేబుల్ టెన్నిస్ (మహిళలు సింగిల్స్)లో జేఎన్టీయూ అనంతపురం విన్నర్ కాగా రన్నర్‌గా ఎన్‌బీకేఆర్ నెల్లూరు, టేబుల్ టెన్నిస్ (మహిళలు డబుల్స్)లో కూడా జేఎన్టీయూ అనంతపురం విన్నర్ కాగా పులివెందుల జేఎన్టీయూ రన్నర్‌గా నిలిచారు. బ్యాడ్మింటన్ (మహిళలు సింగిల్స్)లో కేఎంఎం కాలేజీ, తిరుపతి విన్నర్ కాగా జేఎన్టీయూ అనంతపురం రన్నర్‌గా, బాడ్మింటన్ (మహిళలు డబుల్స్)లో కేఎంఎం తిరుపతి విన్నర్‌గా, గౌతమి కాలేజీ ప్రొద్దుటూరు రన్నర్‌గా నిలిచారు. బ్యాడ్మింటన్ (పురుషుల సింగిల్స్)లో మిట్స్ మదనపల్లె రన్నర్‌గా, ఎస్ఆర్ఈసీ నంద్యాల రన్నర్‌గా నిలిచారు. బ్యాడ్మింటన్ (పురుషులు డబుల్స్)లో మిట్స్ మదనపల్లె విన్నర్‌గా, విశ్వోదయ కావలి రన్నర్‌గా నిలిచాయి. త్రోబాల్ (మహిళలు)లో మదనపల్లె మిట్స్ విన్నర్‌గా, జేఎన్టీయూ కలికిరి రన్నర్‌గా నిలిచారు. హ్యాండ్‌బాల్ (మహిళలు)లో పులివెందుల జేఎన్టీయూ విన్నర్‌గా, ఎన్‌బీకేఆర్ నెల్లూరు రన్నర్‌గా నిలిచారు. వాలీబాల్ (మహిళలు)లో తిరుపతి ఎస్వీసీఈ విన్నర్‌గా, అనంతపురం జేఎన్టీయూ రన్నర్‌గా గెలిచారు. ఖోఖో (పురుషులు)లో కలికిరి జేఎన్టీయూ విన్నర్‌గా, కేఎస్ఆర్ఎం కడప కాలేజీ రన్నర్‌గా నిలిచారు. హ్యాండ్‌బాల్ (పురుషులు)లో పుత్తూరు సిద్దార్థ కాలేజీ విన్నర్‌గా, కలికిరి జేఎన్టీయూ రన్నర్‌గా నిలిచారు. వాలీబాల్ (పురుషులు)లో పుత్తూరు సిద్దార్థ విన్నర్‌గా, మదనపల్లె మిట్స్ కళాశాల రన్నర్‌గా నిలిచాయి.

విద్యా వికాసానికి క్రీడా పోటీలు దోహదం

● జేఎన్టీయూ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు

క్రీడా పోటీలు గెలుపోటముల కోసం కాదని వ్యక్తిత్వ వికాసానికి, క్రమశిక్షణకు, జట్టు స్ఫూర్తికి దోహదం చేస్తాయని కలికిరి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక జేఎన్టీయూ కళాశాలలో మూడు రోజులు జరిగిన ఇంటర్ కాలేజీ క్రీడా పోటీల ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గెలుపును ఆస్వాదించడంతో పాటు అదే స్థాయిలో ఓటమిని స్వీకరించేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం వివిధ క్రీడా పోటీల్లో గెలుపొందిన జట్లకు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమానికి వైస్ ప్రిన్సిపాల్ త్యాగరాజన్, అనంతపురం జేఎన్టీయూ పీడీ జోజి రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, కళాశాల సిబ్బంది హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 29 ఇంజనీరింగ్ కళాశాలల నుంచి మొత్తం 830 విద్యార్థులు పాల్గొన్నారు.

ఘరానా మోసం

● ఉద్యోగాల పేరుతో టోకరా

గార్లదిన్నె, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల పేరుతో తమను మోసం చేశాడని బాధితులు ఓ వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు గార్లదిన్నె మండలం కనుంపల్లికి చెందిన మంజునాథ్‌రెడ్డి బీటెక్ పూర్తి చేసి, ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. ఇతడికి గత ఏడాది చెన్నేకొత్తపల్లికి చెందిన నరసింహులు అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. తనకు సాఫ్ట్‌వేరు కంపెనీలు తెలుసునని, నీకు మంచి ప్యాకేజీతో ఉద్యోగం ఇప్పిస్తానని మంజునాథ్‌రెడ్డిని నరసింహులు నమ్మించాడు. ఇందుకు తనకు రూ. 6 లక్షలు ఇవ్వాలన్నాడు. నరసింహులు మాటలు నమ్మిన మంజునాథ్‌రెడ్డి విడుతల వారిగా అతడికి ఫోన్‌పే, బ్యాంకు ద్వారా రూ. 6 లక్షలు చెల్లించాడు. అదేవిధంగా మంజునాథ్‌రెడ్డి అనంతపురంలోని తన స్నేహితుడితో కూడా మరో రూ.6 లక్షలు ఇప్పించాడు. మొత్తం రూ. 12 లక్షలు నరసింహులు అకౌంట్‌కు వేశారు. ఏడాది అయిన ఉద్యోగం ఇప్పించలేదు. ఫోన్ చేస్తే అందు బాటులో లేడు. తాను మోసపోయానని భావించిన మంజునాథ్‌రెడ్డి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నరసింహులుపై ఫిర్యాదు చేశాడు. నరసింహులు ఇలాంటి మోసాలు చాలా చేసి అమాయకులతో లక్షలు కాజేసినట్లు తెలిసింది.

అందుబాటులో లేని ఎంపీటీసీలు

● ఎంపీపీ ఎన్నికకు హాజరు కావాలని నోటీసులు



ఎంపీటీసీ సభ్యుడి ఇంటికి నోటీసులు అతికిస్తున్న అధికారులు

రామగిరి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న రామగిరి మం డల ప్రజాపరిషత్ అధ్య క్ష ఎన్నిక జరగ నుండ డంతో ఎంపీటీసీలకు ఎంపీడీఓ కార్యాలయం నుంచి నోటీసులు పం పారు. శని, ఆదివారాల్లో నోటీసులు ఇచ్చేందుకు వెళ్లగా ఆరుగురు ఎంపీ టీసీలు అందుబాటులోలేరు. అందుబాటులో లేని ఎంపీటీసీలందరూ వైసీపీ వర్గీయులే. పేరూరు-2, కొండాపురం, ఎంసీపల్లి, కుంటిమద్ది, గంతిమర్రి, పోలేపల్లి ఎంపీటీసీలు అందుబాటులో లేకపోవడంతో వారి ఇంటి గోడలకు అధికారులు నోటీసులు అతికించారు. ఫోన్‌ద్వారా సమాచారం ఇచ్చేందుకు కూడా వారు అందుబాటులో లేరని తెలిసింది. మండలంలో 10 ఎంపీటీసీ స్థానాలు ఉండగా 9 స్థానాల్లో వైసీపీ వర్గీయులు, ఒకచోట టీడీపీ గెలిచింది. అందులో ఇద్దరు అసంతృప్తితో పార్టీకి దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. మిగిలిన ఆరుగురిని వైసీపీ నాయకులు తమ ఆధీనంలో ఉంచుకున్నట్లు సమాచారం. జనరల్ మహిళకు ఎంపీపీ రిజర్వు కావడంతో.. మహిళా ఎంపీటీసీలైన ఎంసీపల్లి, పేరూరు-2 వారికి అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. శనివారం సాయంత్రం ఎంసీపల్లి ఎంపీటీసీ ఆదిలక్ష్మి పుట్టపర్తి ఎస్పీ కార్యాలయానికి వెళ్లి ఎంపీపీ ఎన్నిక ప్రశాంతంగా జరిగేలా చూడాలని వినతి పత్రం ఇచ్చినట్లు తెలిసింది.

ఫుట్‌బాల్ పోటీల్లో తిరుగులేని కొల్లేరు జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఏపీ సూపర్ ఫుట్‌బాల్ కప్-2025 పోటీల్లో కొల్లేరు జట్టు తిరుగులేని విజయాలు నమోదు చేస్తోంది. స్థానిక ఆర్డీటీ స్టేడియంలో ఏపీ సూపర్ ఫుట్‌బాల్ కప్-2025 పోటీలు ఆదివారం నాలుగోరోజు కొనసాగాయి. నాలుగోరోజు పోటీల్లో నల్లమల జట్టుపై విశాఖ జట్టు 3గోల్స్ తేడాతో, తుంగభద్రపై గోదావరి 5గోల్స్ తేడాతో, పెన్నాపై వంశధార గోల్, కోరమాండల్‌పై కొల్లేరు 2గోల్స్ తేడాతో విజయం సాధించాయి. వరుసగా నాలుగు విజయాలు సాధించిన కొల్లేరు క్లబ్ జట్టు 12 పాయింట్లతో జాబితాలో మొదటి స్థానంలో కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సరిపూటి వేణుగోపాల్, సభ్యులు, కోచ్‌లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

పశువుల సంత ఆదాయం రూ.4.61లక్షలు

అనంతపురం రూరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు పశులసంతతో రూ. 4,61,140 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.2,79,050, ఆదివారం ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ. 1,82,090 వచ్చిందని తెలిపారు.

అగ్నికి ఆహుతైన చీనీ తోట

● రూ.8 లక్షల నష్టం



కాలిపోయిన చీనీ తోట

కనగానపల్లి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు నిప్పంటుకొని చీనీ తోటతో పాటు వ్యవసాయ పరికరాలు కాలిపోయిన ఘటన శనివారం రాత్రి శివపురంలో చోటుచేసుకుంది. దీంతో రైతుకు రూ. 8 లక్షలు నష్టం వాటిల్లింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మురళి నాలుగు ఎకరాల్లో చీనీ తోట సాగుచేస్తున్నాడు. ప్రస్తుతం చీనీ పంట కోతదశలో ఉంది. ఉగాది పండుగ తరువాత పంటను కోసి మా ర్కెట్‌కు తరలించాలని రైతు భావించాడు. ఇంతలోనే గుర్తుతెలియని వ్యక్తులు తోట పక్కన ఉన్న చెత్తకు నిప్పుపెట్టడంతో మంటలు వ్యాపించి చీనీతోట కాలిపోయింది. రాత్రిపూట కావడంతో మంటలు అదుపుచేసేందుకు వీలుకాలేదు. దీంతో తోటలోని వ్యవసాయ పరికరాలు సైతం మంటల్లో కాలిపోయాయని బాధిత రైతు వాపోయాడు. చీనీతోట కాలిపోవడంతో రూ.8లక్షల వరకూ నష్టపోయాయని, ప్రభుత్వమే ఆదుకోవాలని కోరాడు.

సంక్షిప్త వార్తలు

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

గుంతకల్లు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): బేడ బుడగజంగాలను ఎస్సీ జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసినందుకు సీఎం చంద్రబాబు చిత్రపటానికి ఆ కుల సంఘం నాయకులు పాలాభిషేకం చేశారు. పట్టణంలోని 12వ వార్డులో ఆదివారం బేడ బుడగజంగం కుల సంఘ పట్టణ అధ్యక్షుడు, టీడీపీ నేత గిడ్డయ్య ఆధ్వర్యంలో సంఘం నాయకులు సీఎంకు కృతజ్ఞత సభను నిర్వహించారు. ఈ సందర్భంగా గిడ్డయ్య మాట్లాడుతూ బేడ బుడగ జంగాల (కథల)వారు ప్రస్తుతం సామాజికంగా, ఆర్థికంగా ఎన్నో అసమానతలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. బుడగజంగాలను ఎస్సీ జాబితాలో చేర్చాలంటూ ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నామన్నారు. దీని ఫలితంగా గత అసెంబ్లీ సమావేశాల్లో ఇందుకు తీర్మానం చేశారన్నారు. అందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సంఘంసభ్యులు, కులస్థులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఉరవకొండ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, రిటైర్డ్ ఎంపీడీఓ గణేష్‌బాబు సూచించారు. ఉగాది పండుగను పురస్కరించుకుని పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆవరణలో ఆదివారం షటిల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఇందులో 15టీంలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా గణేష్‌బాబు మాట్లాడుతూ.. రెండ్రోజుల పాటు ఈ షటిల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు చెప్పారు. గెలుపొందిన క్రీడాకారులకు ఉగాది రోజున బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు మల్లికార్జున, సురేంద్ర, సంజీవ్‌రెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బొమ్మనహాళ్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కేజీబీవీలో 2025-26 విద్యాసంవత్సరానికి 6వ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కమలమ్మ ఆదివారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేసుకోవాలన్నారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ సీఈసీ గ్రూప్‌లో కేవలం 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఏప్రిల్ 11వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాప్ అవుట్స్ విద్యార్థులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు అర్హులని అన్నారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిగణిస్తామని, ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందిస్తామని చెప్పారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభించిన కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం రూరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సూర్యసేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. సూర్యసేవా సమితి అధ్యక్షుడు పసుపులేటి వెంకటేశులు, వైస్ ప్రెసిడెంట్ ఒబేదుల్లా, సెక్రెటరీ ఇల్లూరి శ్రీనివాసులు, జాయింట్ సెక్రెటరీ దబ్బడి శేఖర్, ట్రెజరర్ బీఎస్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మండల పూజ

రాయదుర్గంరూరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపురం గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి మాలధారులు మండల పూజను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత స్థానిక నరసింహస్వామి ఆలయంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు రామ్మూర్తిస్వామి ఆధ్వర్యంలో అర్చకుడు స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం మాలధారుల చేత మండల పూజ చేశారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పాల్గొని స్వామికి ప్రత్యేకపూజలు చేయించారు. కార్యక్రమంలో సభ్యులు ధర్మన్న, సత్యనారాయణ, నరసింహులు, టీడీపీ మండల కన్వీనర్ హనుమంతు, పట్టణ అధ్యక్షుడు పసుపులేటి రాజు, నాయకులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

యాడికి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములపాడులో నేడు రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి జూటూరు రఫీ ఒక ప్రకటనలో తెలిపారు. కామ్రేడ్, దివంగత వీకే వెంకట్రామిరెడ్డి ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకొని రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. రక్తదాతలు స్వచ్ఛందంగా రక్తదాన శిబిరంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కుక్కల దాడిలో 13గొర్రెలు మృతి

పుట్లూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాలవేముల గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున కుక్కల దాడిలో 13గొర్రెలు మృతిచెందినట్లు మండల పశువైద్యాధికారి సువర్ణ తెలిపారు. అదే గ్రామానికి చెందిన బాధితులు కిట్టయ్య, తిరుమలయ్యలు గ్రామశివారులో గొర్రెలను మేపుకొని అక్కడే నిద్రిస్తుండగా తెల్లవారుజామున కుక్కలు వచ్చి దాడి చేశాయన్నారు. 13గొర్రెలు మృతిచెందగా మరో 10గొర్రెలు గాయాలపాలయ్యాయని తెలిపారు. వాటికి చికిత్స అందిస్తున్నామని ఆమె తెలిపారు. సుమారు లక్ష రూపాయల మేర నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు.

శ్రీరామనవమి వేడుకల పోస్టర్ల విడుదల

గుత్తి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటవీధిలో గల రామాలయంలో ఏప్రిల్ 6వ తేదీన శ్రీరామనవమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆదివారం ఆలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏప్రిల్ 6న శ్రీరామనవమి సందర్భంగా ఆలయంలో 11 గంటలకు సీతారాముల కల్యాణం నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 4గంటలకు పల్లకి సేవ ఉంటుందన్నారు. ఆలయ అధ్యక్షుడు ప్రసాద్ తదితరులు, సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

యల్లనూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో లక్ష్మీ వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయాన్నే ఆలయంలోని మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామదేవత పెద్దమ్మకు బోనాలు సమర్పించి రథానికి ప్రత్యేక హోమాది కార్యక్రమాలు జరిపారు. తర్వాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను రథంలో కొలువుదీర్చి పురవీధుల గుండా ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

అకాల వర్షం.. అపార నష్టం

● సుమారు 600 ఎకరాల్లో దెబ్బతిన్న అరటి



పెద్దపప్పూరు మండలం ముచ్చుకోటలో నేలకొరిగిన అరటి చెట్లు

యల్లనూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని శనివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి సుమారు 600ఎకరాల్లో అరటిపంటలకు నష్టం వాటిల్లింది. సాయంత్రం 6గంటల సమయంలో ఒక్కసారిగా మెరుపులు, ఉరుములతో కూడిన వర్షంతోపాటు అక్కడక్కడ వడగండ్లు పడ్డాయి. దీంతో కోత దశకు వచ్చిన అరటి చెట్లు నేలకొరిగాయి. వడగండ్లు పడిన ప్రాంతంలో కాయలపై మచ్చలు కూడా ఏర్పడ్డాయి. రెడ్డంపల్లి కొట్టాల, దంతలపల్లి, తిమ్మంపల్లి, గొడ్డుమర్రి, కూచివారిపల్లి గ్రామాల్లో నష్టం ఎక్కువగా జరిగింది.

దెబ్బతిన్న అరటి, మొక్కజొన్న పంటలు

పెద్దపప్పూరు: మండలంలోని ముచ్చుకోట, అమ్మలదిన్నె, వరదాయపల్లి, చిక్కేపల్లి, నామనాంకపల్లి, రెడ్డిపల్లితోపాటు పలు గ్రామాల్లో అకాల వర్షానికి అరటి, మొక్కజొన్న పంటలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఆ పంటలను మండల ఉద్యానవన, వ్యవసాయశాఖల అధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది ఆదివారం పరిశీలించారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం: ఎంపీ అంబికా

యల్లనూరు: అకాల వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని, ఎవరూ అధైర్యపడవద్దని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ భరోసా ఇచ్చారు. గత శనివారం వారం రాత్రి కురిసిన అకాల వర్షానికి మండలంలోని నీర్జాంపల్లి, తిమ్మంపల్లి, కొడవండ్లపల్లి, కూచివారిపల్లి గ్రామాల్లో నేలకొరిగిన అరటి, మొక్కజొన్న పంటలను ఎంపీ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పంటలు సాగుచేయడానికి అయిన పెట్టుబడి వివరాలను బాధిత రైతులను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో అంచనాలను తయారుచేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయశాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి నష్టపరిహారం అందేలా చేస్తానని ఎంపీ రైతులకు హామీ ఇచ్చారు.



నీర్జాంపల్లిలో అరటిపంటను పరిశీలిస్తున్న ఎంపీ అంబికా

రైతులను ఆదుకోవాలి: జేసీపీఆర్



మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్ రెడ్డి

తాడిపత్రి: అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కోరారు. పట్టణంలోని తన నివాసంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అకాల వర్షాల వల్ల తాడిపత్రి నియోజకవర్గంతోపాటు శింగనమల నియోజకవర్గంలో కూడా వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. కలెక్టర్, ఉద్యానవనశాఖ అధికారులు ప్రత్యేక చొరవచూపి నష్టపోయిన రైతులకు ఆదుకోవాలని కోరారు. కనీసం రెండునెలలు ఆగిఉంటే రైతులకు ఆశించినంత దిగుబడి వచ్చిఉండేదన్నారు. ప్రస్తుతం ఈ అకాల వర్షాల వల్ల పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొందన్నారు. ఆదుకోకపోతే రైతులకు ఆత్మహత్యలే శరణ్యమని అన్నారు. కలెక్టర్ మీద అపారమైన నమ్మకం ఉందని, రైతులకు కచ్చితంగా న్యాయం చేస్తారని అన్నారు. పెద్దవడుగూరు యాడికి, పెద్దపప్పూరు మండలాలతో పాటు శింగనమల నియోజకవర్గంలోని యల్లనూరు, పుట్లూరు మండలాల్లోని చాలా గ్రామాల్లో భారీగా పంట నష్టం జరిగిందన్నారు. అరటితోపాటు బొప్పాయి, దానిమ్మ, మొక్కజొన్న పంటలు నష్టపోయారని, రైతులను ఆదుకోవాలని కోరారు. ఉద్యానవన అధికారులు ఇంతవరకు కనిపించలేదని, వారు దయచేసి ఫీల్డ్‌కు వెళ్లి పరిస్థితులను చూసి నివేదికను తయారుచేసి కలెక్టర్‌కు పంపించాలని ఆయన సూచించారు.

తీవ్రమైన పశుగ్రాసం కొరత

●అలమటిస్తున్న మూగజీవాలు ● అధిక ధరకు కొనుగోలు చేస్తున్న పాడిరైతులు



పశుగ్రాసాన్ని కొనుగోలుచేసి తెచ్చుకుంటున్న రైతు

శెట్టూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఎండలు మండుతుండడంతో పచ్చికబైళ్లు ఎండిపోయాయి. అటవీ ప్రాంతమంతా తిరిగినా కూడా తరచూ అగ్నిప్రమాదాలు జరుగుతుండడంతో చెట్టూచేమ కాలిపోయి గుక్కెడు మేత కూడా దొరకడం లేదు. దీంతో మూగజీవాలు ఆకలితో అలమటిస్తున్నాయి. పాడిరైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో పశువులకు మేత కోసం నానా అవస్థలు పడుతున్నారు. చేసేదిలేక మండలంలోని పలువురు రైతులు ఇతర ప్రాంతాలకు వెళ్లి అధిక ధరలు వెచ్చించి గ్రాసాన్ని కొనుగోలు చేస్తున్నారు. కణేకల్లు ప్రాంతం నుంచి ఒక ట్రాక్టర్ వరిగడ్డిని రూ. 8 వేలకు కొనుగోలు చేసి పశువులను పోషించుకుంటున్నారు. ఆ ట్రాక్టర్ గడ్డి ఎక్కువరోజులు రాదని, మళ్లీ కొనుగోలు చేయాల్సిందేనని పలువురు వాపోతున్నారు. ప్రభుత్వం పశువుల మేత కోసం పశుగ్రాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

పశుపోషణ భారంగా మారింది



పశుగ్రాసం కొరతతో పశుపోషణ భారంగా మారింది. పచ్చిక బయళ్లు ఎండిపోయి, అడవులు కాలిపోవడంతో పశువులకు గ్రాసం దొరకడం లేదు. దీంతో పశుపోషణకు ఏమిచేయాలో అర్థం కావడం లేదు.

- మల్లయ్య, రైతు, బసంపల్లి

సిరిధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న పద్మశ్రీ అవార్డు గ్రహీత ఖాదర్‌వలి

ఉరవకొండ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): సిరిధాన్యాలతో కూడిన ఆహారం తీసుకుంటే ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చునని పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రఖ్యాత స్వతంత్ర ఆహార ఆరోగ్య శాస్త్రవేత్త డాక్టర్ ఖాదర్‌వలి సూచించారు. పట్టణంలోని షిర్డీసాయి కల్యాణ మండపంలో ఆదివారం సిరిధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందుకు గవిమఠం ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి, అర్బన్, రూరల్ సీఐలు మహానంది, చిన్నగౌస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖాదర్‌వలి మాట్లాడుతూ ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా అనేకమందికి వివిధ జబ్బులు చుట్టుముడుతున్నాయన్నారు. ఆహారపు అలవాట్లను మార్చుకుని సిరిధాన్యాలు స్వీకరిస్తే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని తెలిపారు. నిస్వార్థ ఫౌండేషన్ సభ్యులు సుధాకర్‌రెడ్డి, వెంకట్ పాల్గొన్నారు.

పప్పుశనగ కొనుగోలు కేంద్రం ఏర్పాటు

విడపనకల్లు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పప్పుశనగ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఏఓ పెన్నయ్య ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఏపీ మార్క్‌ఫెడ్ అధ్వర్యంలో ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రంలో పప్పుశనగ విక్రయించాలనుకునే రైతులు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలలో రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం మద్దతు ధర రూ. 5650లుగా నిర్ణయించినట్లు చెప్పారు. రైతులు వినియోగించుకోవాలని కోరారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ఉరవకొండ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్డీటీ కార్యాలయ ఆవరణంలో శాంతిరామ్ ఆసుపత్రి, డీజీహెచ్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరంను నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ కృష్ణవేణి ప్రారంభించారు. వైద్యులు సైపుల్లా, రాఘవేంద్ర, భాస్కర్ పలువురికి కంటి పరీక్షలు నిర్వహించారు. 21మందిని శస్త్ర చికిత్సల కోసం ఎంపిక చేశారు. కార్యక్రమంలో డీజీహెచ్‌ఎస్‌ఎస్ నాయకులు గోపాల్, రమేష్, చంద్రశేఖర్, వజ్రకరూరు సర్పంచ్ మోనాలిసా, ఎమ్మార్పీఎస్ నాయకుడు బెంజిమన్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగిద్దాం

● వక్తల పిలుపు ●వర్ధంతి సందర్భంగా ఘన నివాళి

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: సర్దార్ భగత్ సింగ్ ఆశయాలను కొనసాగిద్దామని వక్తలు పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా అన్ని ప్రాంతాల్లో ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్యం కోసం భగత్ సింగ్ చేసిన త్యాగాన్ని విద్యార్థులకు వివరించారు. చిన్న వయసులోనే ఉరికంబం ఎక్కి ప్రాణత్యాగం చేశారని చెప్పారు. ఆయనతో పాటు రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు కూడా అమరులయ్యారని వివరించారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు భగత్‌సింగ్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, సీపీఎం, సీపీఐ, డీవైఎఫ్‌ఐ, సీఐటీయూ, ఐద్వా, టీడీపీ, జేవీవీ నాయకులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



కుందుర్పిలో భగత్‌సింగ్ చిత్రపటం వద్ద విద్యార్థుల నివాళి



గుత్తిలో విగ్రహం వద్ద జేవీవీ ఆధ్వర్యంలో..

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

తాడిపత్రి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటరెడ్డిపల్లి గ్రామ సమీపంలో ఆదివారం ట్రాక్టర్, ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో మురుగేష్ (56) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనపై రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. తమిళనాడు రాష్ట్రం తుని జిల్లా దేవదానపట్టి ప్రాంతానికి చెందిన మురుగేష్ గత కొంతకాలంగా తాడిపత్రి పట్టణంలో నివాసం ఉంటున్నాడు. ద్విచక్రవాహనంలో స్టీల్ సామాగ్రి తీసుకొని గ్రామాల్లో తిరుగుతూ అమ్ముకుని జీవనం సాగిస్తుండేవాడు. కాగా రోజుమాదిరిగానే ఆదివారం కూడా ద్విచక్రవాహనంపై స్టీల్‌సామాగ్రి అమ్మడానికి బయలుదేరాడు. అయితే వెంకటరెడ్డి పల్లి గ్రామ సమీపంలో ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీంది. ప్రమాదంలో అతను అక్కడిక్కడే మృతిచెందాడు. ఇతడికి భార్య కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మురుగేష్ అన్న ముత్తుకిషన్ ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేశామని సీఐ పేర్కొన్నారు.

మల్లేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు మృతి



మంజునాథ్ (ఫైల్)

కంబదూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రసిద్ధి చెందిన మల్లేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు మంజునాథ్ (42) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇటీవల ఇంటికి వచ్చారు. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న అతను ఉన్నట్టుండి మృతి చెందారు. విషయం తెలుసుకున్న దేవాదాయ అధికారులు, టీడీపీ నాయకులు, గ్రామస్థులు, వివిధ ఆలయాల పూజారులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. సుమారు 25 ఏళ్ల నుంచి ఆయన ఆలయంలో అర్చకుడిగా పనిచేస్తూ వచ్చారు. కొన్నేళ్ల పాటు ప్రధాన అర్చకుడిగా ఎండోమెండ్ అధికారులు ప్రత్యేకంగా నియమించారు. అయితే అకాల మృతి చెందడంతో భార్య, పిల్లలు వీధినపడ్డారు. మృతుడికి భార్య మల్లేశమ్మ, ముగ్గురు పిల్లలు సంతానం ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

బొమ్మనహాళ్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురవళ్లి గ్రామంలో లక్ష్మమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణం కోసం టీడీపీ నాయకుడు, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున రూ. 20వేలను విరాళం ఇచ్చారు. ఆలయ కమిటీ సభ్యులకు ఆదివారం ఆయన ఆ నగదును అందించారు.

ఇసుక టిప్పర్ల సీజ్

కణేకల్లు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని వేదావతి హగరి నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఆరు టిప్పర్లను ఆదివారం సీజ్ చేసినట్లు ఎస్‌ఐ నాగమధు తెలిపారు. స్థానికంగా ఉన్న కొంతమంది వ్యక్తులు తమ అవసరాల కోసం టిప్పర్లతో ఇసుకను తరలిస్తుండగా తమకు సమాచారం వచ్చిందని, వెంటనే సిబ్బందితో వెళ్లి సాయిబాబా ఆలయం వద్ద అడ్డుకుని సీజ్ చేసినట్లు చెప్పారు. సొంత అవసరాలకు ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల ద్వారా రవాణా చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. టిప్పర్లతో తరలించడం చట్టరీత్యా నేరంగా పరిగణించి సీజ్ చేశామని అన్నారు. అలాగే డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు.

వార్షికోత్సవ మహాసభలను విజయవంతం చేయండి

గుత్తి, మార్చి 23(ఆంధ్రజ్యోతి):అనంతపురంలో జిల్లా ప్రైవేట్ ప్రాక్టీషనర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీన అనంతపురంలో నిర్వహించే 30వ వార్షికోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని ఆ అసోసియేషన్ నాయకులు నాగేంద్ర, షేక్షావలి పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంకు వార్షికోత్సవ సభ ఆహ్వాన పత్రికను అందజేశారు.

సీసీ కెమెరాల ఏర్పాటు పూర్తి

విడపనకల్లు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ ప్రాంతాలలో సీసీ కెమెరాల ఏర్పాటు పూర్తయినట్లు ఎస్‌ఐ ఖాజా హుస్సేన్ ఆదివారం తెలిపారు. మండలంలోని వివిధ గ్రామలతో పాటు మండల కేంద్రంలోను 15 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఎమ్మెల్యే గుమ్మనూరు ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

●హాజరైన ఎంపీ అంబికా, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు



విందులో పాల్గొన్న ఎమ్మెల్యే గుమ్మనూరు, ఎంపీ అంబికా, వెంకటశివుడు యాదవ్

గుంతకల్లు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసం ఒక్కపొద్దు ఉన్న ముస్లింలకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పట్టణంలో పెద్దఎత్తున ఇఫ్తార్ విందు ఇచ్చారు. స్థానిక ఎస్‌జేపీ ఉన్నత పాఠశాల వద్ద ఉన్న ఈద్గా మైదానంలో ఆదివారం రాత్రి నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటుచేసే అవకాశం లభించడం అదృష్టమన్నారు. ముస్లింలు, హిందువుల మధ్య సోదరభావం విలసిల్లాలని ఆకాంక్షించారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, వెంకట శివుడు యాదవ్ ముస్లింలకు ముందస్తు సలామి, పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ముస్లింలకు భోజనాన్ని వడ్డించారు. తహసీల్దార్ రమాదేవి, టీడీపీ నాయకులు కేసీ హరి, తలారి మస్తానప్ప, కే కృపాకర్, గుజరీ మహమ్మద్ ఖాజా, ఫజులు, ఫ్రూట్ మస్తాన్ పాల్గొన్నారు.

జోరుగా కర్ణాటక మద్యం విక్రయాలు

● బొమ్మనహాళ్ మండలంలోయథేచ్ఛగా సరఫరా

బొమ్మనహాళ్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలో కర్ణాటక మద్యం ఏరులై పారుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో కొందరు నాయకులు, కార్యకర్తలు కర్ణాటక నుంచి మద్యం అక్రమంగా తరలించి జేబులు నింపుకున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం మారినా వారు కర్ణాటక మద్యం అమ్మకాలను యథేచ్ఛగా సాగిస్తున్నారు. బొమ్మనహాళ్ మండలం కర్ణాటక సరిహద్దులో ఉండడం, చెక్ పోస్టులో తనిఖీలు లేకపోవడంతో కర్ణాటక మద్యం రవాణా జోరుగా సాగుతోంది. మండలంలోని ఉద్దేహాళ్, శ్రీధరఘట్ట, గోవిందవాడ తదితర గ్రామాల్లో కర్ణాటక మద్యం విక్రయాలు అధికంగా సాగుతున్నాయి. విషయం తెలిసినా ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. టెట్రాప్యాకెట్ల అమ్మకాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. శ్రీధరఘట్ట గ్రామంలో సచివాలయం పక్కనే టెట్రాప్యాకెట్లు తాగి పడేస్తున్నారు. మద్యం బాబులు అవసరమైన మందు తెప్పించుకోవాలంటే ఫోన్‌పేలో డబ్బు పంపితే చాలు డోర్ డెలివరీ తలపించేలా వారి వద్దకే కర్ణాటక మద్యం వచ్చి చేరుతోంది. 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్ ధర కర్ణాటకలో రూ. 35 లు అయితే ఇక్కడ రూ. 65 నుంచి రూ. 70 వరకు అమ్ముతున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, సచివాలయాల వద్ద మద్యం తాగి ప్యాకెట్లు, గ్లాసులు అక్కడే పడేస్తుండడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై కణేకల్లు ఎక్సైజ్ సీఐను వివరణ కోరేందుకు ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

కొత్తమిద్దెలలో ఘర్షణ

● ఐదుగురికి తీవ్రగాయాలు

కళ్యాణదుర్గం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కంబదూరు మండలం కొత్త మిద్దెలలో ముస్లింలు ఆదివారం రాత్రి ఘర్షణ పడ్డారు. దీంతో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కొత్త మిద్దెల గ్రామంలో ముస్లింల మధ్య చిన్నపాటిగా గొడవ మొదలైంది. అది కాస్తా పెద్దదై చివరికి ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఇందులో షరీఫ్, హుస్సేన్‌బీ, రఫీ, గౌస్, షానులకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108లో కంబదూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం కోసం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పాత కక్షలను మనసులో పెట్టుకుని తమపై దాడి చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కంబదూరు ఎస్‌ఐ ప్రవీణ్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.